ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆవులయ్య

బెల్ట్ తీస్తాం

- బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు
- ఐదు మద్యం షాపులకు అపరాధ రుసుం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య

ఏలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నిరంతర నిఘా పెట్టామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య హెచ్చరించారు. ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బెల్టు షాపులపై ఇప్పటి వరకు 456 కేసులు నమోదు చేసి 478 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. బెల్టుషాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్న కుక్కునూరు, ఏలూరు రూరల్, పెదవేగి, భీమడోలులోని ఐదు మద్యం దుకాణాలను సీజ్ చేసి రూ.5 లక్షల చొప్పున అపరాధ రుసుం విధించామన్నారు. జిల్లాలో మొత్తం 155 మద్యం షాపులున్నాయని, కచ్చితంగా ఎమ్మార్పీకే మద్యం అమ్మేలా చర్యలు తీసుకుంటున్నామని, రాత్రి 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అమ్మకాలు జరగకుండా నిరంతరం సిబ్బంది నిఘా పెట్టినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 70 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నెలాఖరు నాటికి 140 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతామన్నారు. సారా తయారీతో జీవనం సాగిస్తున్న పలువురికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తున్నామన్నారు. 35 కుటుంబాలకు చెందిన 138 మంది మహిళలకు ఉన్నతి, స్త్రీ నిధి పథకాల్లో వడ్డీలేని రుణాలు అందించి స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని ఆవులయ్య వివరించారు. జిల్లాలో ఎక్కడైనా బెల్ట్ షాపులు, సారా విషయాలపై 14405 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



గిరిజనాభివృద్ధి

ధర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌పై కలెక్టర్ సమీక్ష

ఏలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్-2025 పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఉత్కర్ష్ అభియాన్-2025 పథకం అమలుపై ఆదివారం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గిరిజనుల సాధికారత, ఆర్థిక, సామాజికాభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఈ కార్యక్రమంపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గిరిజనులకు గృహాలు, రోడ్లు, తాగునీటి సౌకర్యాలపై నుంచి వినతులు తీసుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆధార్ కార్డులు, జన్‌ధన్ ఖాతా, కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



యోగా చేద్దాం

జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి సమీక్ష

ఏలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవం జరిగే జూన్ 21లోగా జిల్లాలోని ప్రజలందరూ ఇందులో భాగస్వామ్యం కావాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ బంగ్లా నుంచి ఆదివారం యోగాంధ్ర కార్యక్రమంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 299 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ పూర్తయిందని, ప్రతీ సచివాలయం పరిధిలో మరో 100 మంది ట్రైనీలకు శిక్షణ చేపట్టాలన్నారు. ఈ నెల 26 నుంచి జూన్ 14 వరకు యోగాపై ప్రత్యేక కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతీ ఒక్కరూ క్యూఆర్ కోడ్ లేదా వెబ్ ద్వారా నమోదు కావాలని కోరారు. జిల్లాలో 8లక్షల మంది రిజిస్ట్రేషన్ లక్ష్యమని ధాత్రిరెడ్డి తెలిపారు.





మేఘాలను చీల్చుకుంటూ సూర్య భగవానుడు భగభగమంటే.. సూర్య ప్రతాపాన్ని అడ్డుకుంటామంటూ మేఘాలు వెన్నంటాయి. ఫలితంగా ఎండ, వాన వాతావరణంలో ప్రజలకు కొంత ఉపశమనం దొరికింది. ఆదివారం ఉదయం ఎండ వేడిమి పెరుగుతున్న తరుణంలో మేఘాలు అలుముకున్నాయి. మబ్బులతో నీలాకాశం కనువిందు చేసింది. సాయం సంధ్య వేళ కూడా మబ్బులు కమ్ముకోవడంతో అస్తమించే సూర్యవర్ణంతో ఎరుపెక్కిన మేఘాలు అలరించాయి. ద్వారకాతిరుమలలో ఉదయం, సాయంత్రం హృద్యంగా కనిపించిన ఆకాశం ఇలా కెమెరాకు చిక్కింది. - ఫొటోగ్రాఫర్/ఏలూరు



తెలుగుదేశం పార్టీ మహానాడుకు ఉమ్మడి పశ్చిమ నుంచి పెద్దఎత్తున తరలి వెళ్లేందుకు నేతలు, కార్యకర్తలు సకల సన్నాహాల్లో ఉన్నారు. తణుకు, నూజివీడులో జిల్లా స్థాయి మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు. ఇదే స్ఫూర్తితో కడపలో జరిగే మహానాడుకు హాజరుకావాలని మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మహానాడు ప్రతినిధులుగా గుర్తించిన వారందరికీ ఇప్పటికే ఆహ్వానాలు అందాయి. ఈ నెల 29న కడపలో జరిగే భారీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు ఉమ్మడి పశ్చిమ నుంచి ఏర్పాట్లలో నేతలు తలమునకలై ఉన్నారు.

మహా వేడుక

కడప మహానాడుకు ఉమ్మడి పశ్చిమ నుంచి విస్తృత ఏర్పాట్లు

- కడప దిశగా పసుపు దండు
- ఉమ్మడి జిల్లా నుంచి ఆవకాయ
- ప్రతినిధులకు ఏలూరు ఎంపీ ప్రత్యేక వసతి
- ఏర్పాట్లలో నిమ్మల, కొలుసు, చింతమనేని బిజీ
- పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తున్న జిల్లా అధ్యక్షులు మంతెన, గన్ని

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ మహానాడు కడపలో నిర్వహించాలనే అధిష్ఠానం నిర్ణయంతో కేడర్‌లో ఉత్సాహం ఉరకలేసింది. రాయలసీమ తమ కంచుకోటగా వైసీపీ భావిస్తున్న కడపలో పసుపు జెండా సత్తా చూపాలని భావించారు. ఆ దిశగా జిల్లాల్లో మినీ మహానాడు నిర్వహించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ మినీ మహానాడు సమావేశాలు సక్సెస్ అయ్యాయి. పార్టీ తిరిగి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పార్టీ సత్తా మరోసారి బహిర్గతం చేసే దిశగానే మినీ మహానాడు పర్వం సాగింది. నియోజకవర్గ నేతలు తమ మనస్సులో మాటలను వ్యక్తీకరించేందుకు దీనినే వేదికగా తీసుకున్నారు. నామినేటెడ్ పదవుల నుంచి కార్యకర్తలకు గుర్తింపు తీసుకువచ్చే వరకు ప్రధానంగా ప్రస్తావించారు. కార్యకర్తలకు కట్టుబడి ఉన్నామని దీంట్లో ఎలాంటి సందేహం లేనేలేదని మంత్రులు, ఎమ్మెల్యేలు భరోసా ఇచ్చారు. నియోజకవర్గ నేతలంతా ఒకేచోట కలవడం, వివిధ అంశాలను చర్చించడానికి మినీ మహానాడు వేదికలు పక్కాగా కలిసి వచ్చాయి. ఎక్కడ గీత దాటకుండానే ఏడాది సమయంలో పార్టీ పరంగా ప్రజల్లో ఉన్న మనోభావాలను కూడా నేతలు పరస్పరం చర్చించుకోవడానికి దోహదపడ్డాయి. దీంతో పాటు జిల్లా స్థాయి మహానాడులో చేసిన తీర్మానాలు పార్టీ విధానాలకు అద్దం పట్టేలా ఉన్నాయి. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని, లోకేశ్ పార్టీకి చేసిన సేవలను పూర్తిగా గుర్తించాలని, కొల్లేరు సమస్యల పరిష్కారానికి మరింత చొరవ తీసుకోవాలని, ఆక్వారంగంలో ఒడిదుడుకులు తొలగించి రైతులకు అండగా నిలవాలని, పారిశ్రామికీకరణ దిశగా చర్యలు తీసుకొని ఉద్యోగావకాశాలు కల్పించాలని, నూజివీడు, దెందులూరుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేయాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, పార్టీ కోసం నిత్యం కష్టపడే కార్యకర్తల సేవలను గుర్తించాలని తీర్మానాలను ఆమోదించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఏదైతే ఆశిస్తున్నారో అదే అంశాన్ని తీర్మానంగా చేసి ఆమోదించడం తెలుగుదేశం విధానం. ఇరు జిల్లాల అధ్యక్షులు మంతెన రామరాజు, గన్ని వీరాంజనేయులు మహానాడు విజయవంతం చేయడంలో తలమునకలుగా ఉన్నారు.



మహానాడు ఏర్పాట్లలో నేతలు బిజీ బిజీ..

మహానాడు ఏర్పాట్లలో జిల్లాల వారీగా కొందరికి పార్టీ బాధ్యతలు అప్పగించింది. మహానాడు పర్యవేక్షణ ఏర్పాట్లను మంత్రి నిమ్మల రామానాయుడుకు అప్పగించారు. ఆయన మూడు రోజులుగా కడపలోనే మకాం వేసి రోజువారీ పనులను సమీక్షిస్తున్నారు. పార్టీ నిర్దేశించినట్లు నిర్వహణ ఏర్పాట్లపై జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంకో వైపు ఎమ్మెల్యేలు చింతమనేని, ఆరిమిల్లి రాధాకృష్ణకు మరి కొన్ని బాధ్యతలు అప్పగించారు. సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మాజీ మంత్రి పీతల సుజాత తమకు అప్పగించిన పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి రెండు, మూడు వందల మందికి తగ్గకుండా ప్రతినిధుల సభకు హాజరవుతున్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించిన దాదాపు 2వేల మంది ప్రతినిధులకు కడప జిల్లా మైదుకూరులో వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ చొరవ తీసుకుని ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు ప్రత్యేకంగా ఒక నియోజకవర్గ బాధ్యతలను అప్పగించడంతో ఆయన నెల్లూరులో మకాం వేశారు.



ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కార్యాలయం నుంచి కడపకు తరలిస్తున్న మామిడికాయల లోడు

సీమకు గోదావరి ఆవకాయ

మహానాడుకు హాజరయ్యే ప్రతినిధులకు పెద్ద ఎత్తున భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. మన ప్రాంత ఆవకాయ అంటే అందరూ చెవులు కోసుకుంటారు. మామిడి సీజన్ కావడంతో మామిడికాయలు, ఆవకాయ పట్టేందుకు అవసరమైన సరుకులు, నిష్ణాతులైన వారితో సహా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కడపకు బయల్దేరారు. మహానాడుకు హాజరయ్యే వారందరికీ ఆవకాయ రుచి చూపించేందుకు వందల సంఖ్యలో మామిడికాయల లోడుతో వాహనాలు ఆదివారం కడప బాట పట్టాయి. మొదటి నుంచి కేడర్‌కు వండి, వడ్డించడంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ది అందెవేసిన చేయి. ఈ సారి మహానాడులో సైతం వేలమంది గుర్తు పెట్టుకునేలా అసలు సిసలైన ఆంధ్రా ఆవకాయ బాధ్యతను ప్రభాకర్ స్వీకరించారు. దీంతో పాటు మిగతా ప్రాంతాల నుంచి కడపకు వెళ్లే వారిలో అత్యధికులు తమతో పూతరేకులు తీసుకెళ్లాలని ఉత్సాహంగా ఉన్నారు. తమ ప్రతిపాదనను పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. అక్కడుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే పూతరేకులు రుచి చూపించడానికి సిద్ధ పడుతున్నారు.

రొయ్యకు చేటు కాలం !



పట్టుబడి చేస్తున్న కూలీలు (ఇన్‌సెట్) రంగుమారిన వనామి రొయ్యలు

- వాతావరణ మార్పులతో ఉక్కిరిబిక్కిరి
- చెరువుల్లో ఆక్సిజన్ కొరత
- మృత్యువాత పడుతున్న వనామి రొయ్యలు
- భారీగా నష్టపోతున్న రైతులు



కలిదిండి/మండవల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా నిత్యం ఆకాశం మేఘావృతమై ఉదయం వర్షం పడతుండడంతో ఆక్వా రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. రాత్రి సమయంలో వర్షం పడుతూ, పగటి పూట ఎండ వేడికి చెరువులో పీహెచ్ హెచ్చుతగ్గుల కారణంగా రొయ్యలు ఒత్తిడికి గురవుతున్నాయి. సాగు ఆశాజనకంగా ఉంటుందన్న గుంపెడు ఆశతో సాగు చేపట్టారు. నెల రోజులు అంతా సవ్యంగానే సాగింది. ఇంతలో వాతావరణ మార్పులు, విపరీతమైన ఉక్కపోతతో ఆక్వా రంగం తీవ్ర ఒత్తిడికి లోనవుతోంది.

వాతావరణంలో మార్పులతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. చెరువులో పిల్ల వేసిన 18 నుంచి 30 రోజుల వ్యవధి కలిగిన సాగుకు వైట్‌స్పాట్, విబ్రియో వంటి వ్యాధులు సోకి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. కలిదిండి మండలంలో 10 వేల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. సున్నంపూడి, కలిదిండి, కోరుకొల్లు, మట్టగుంట, దుంపలకోడు దిబ్బ, కొండూరు, గొల్లగూడెం, భాస్కరావుపేట, మూల్లంక గ్రామాల్లో 200 ఎకరాల చెరువుల్లో రొయ్యలు చనిపోతుండడంతో చిన్న సైజు రొయ్యలనే హడావుడిగా పట్టుబడి చేస్తున్నారు. వీటిని రొయ్యల కంపెనీల యజమానులు కొనుగోలు చేయకపోవడంతో వారు, ఆకివీడు మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. ఎకరాకు రూ.లక్ష వెచ్చించి ఏరియేటర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఖరీదైన మందులు చల్లుతున్నప్పటికీ ఫలితం లేదని వాపోతున్నారు. ఇదే అదనుగా రొయ్యల వ్యాపారస్థులు సిండికేటుగా మారి ప్రస్తుతం రేటు కంటే తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో కనీసం పెట్టుబడులు రాక అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల దృష్ట్యా చెరువుల్లో ఆక్సిజన్ హెచ్చు తగ్గులపై ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని మత్స్యశాఖ ఏడీ రాజ్ కుమార్ తెలిపారు. చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కోత విధిస్తే వెంటనే జనరేటర్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆక్సిజన్ టాబ్లెట్స్‌నుచెరువుల్లో వేయాలన్నారు. వైరస్ సోకి రొయ్యలు చని పోతుంటే వెంటనే పట్టుబడి చేయాలన్నారు.



నూతన విద్యా సంవత్సరానికి కొత్త యూనిఫాం, విద్యా మిత్ర కిట్ బ్యాగ్

సర్వేపల్లి రాధాకృష్ణన్
విద్యార్థి మిత్ర

- కొత్త యూనిఫాం, బ్యాగ్, విద్యా సామగ్రి

ఏలూరు అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్‌ఆర్‌కేవీఎం) పేరిట కిట్లు సిద్ధమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలలను కూడా వదలకుండా రాజకీయ రంగులు, జగన్ బొమ్మలతో నింపేసిన విద్యాకానుక కిట్లను కూటమి ప్రభుత్వం సమూలంగా మార్చివేసింది. విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర పేరిట కిట్లను పంపిణీ చేయనుంది.

జిల్లాలో 27 మండలాల్లోని 1,609 ప్రభుత్వ పాఠశాలల్లో 1,22,665 మంది విద్యార్థులు ఉంటారన్న అంచనాలతో కిట్లను సిద్ధం చేస్తున్నారు. పుస్తకాల సంచి భారాన్ని తగ్గించేందుకు వీలుగా భాష, ఇతర సబ్జెక్టులకు సెమిస్టర్ విధానంలో ముద్రించిన పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్‌లను ఇప్పటికే జిల్లాకు చేర్చారు. బూట్లు, బెల్టులు వస్తున్నాయి. ఆరో తరగతిలో కొత్తగా చేరే 11,665 మంది విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను ఇవ్వనున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు దాదాపు 90 శాతం జిల్లాకు సరఫరా అయ్యాయని సమగ్రశిక్ష జిల్లా కార్యాలయ వర్గాలు తెలిపాయి.

హుందాగా యూనిఫాం, స్కూలు బ్యాగ్‌లు

విద్యార్థిమిత్ర కిట్లలో మూడు జతల స్కూల్ యూనిఫాంకు సరిపడా వస్త్రం రంగు, డిజైన్ కార్పొరేట్ స్థాయిలో హుందాగా ఉండేలా రూపొందించారు. ఆలివ్‌గ్రీన్ కలర్ గళ్ల డిజైన్‌తో కూడిన వస్త్రాన్ని పంపిణీ చేస్తున్నారు. గ్రీన్ కలర్ స్కూల్ బ్యాగ్‌పై సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర లోగో ముద్రించి ఇవ్వనున్నారు. వీటిపై యూనిక్ ఐడీ ముద్రించి మండలాల వారీగా సరఫరా చేయనున్నారు. ఐడీ వల్ల సంబంధిత కిట్ దుర్వినియోగమైనా, పాడైనా సులువుగా గుర్తించేందుకు వీలవుతుంది. యూనిఫాం దుస్తుల తయారీకయ్యే కుట్టుకూలీ డబ్బులను బాల బాలికల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని సీఎంవో రవీంద్ర తెలిపారు.



సర్‌ప్లస్ టీచర్లలో 'బదిలీ' ఆందోళన

ఏక కాలంలో 24 మందిని ఓడించిన ఏలూరు చెస్ క్రీడాకారుడు

పోలీసుల పేరుతో రూ.85 వేలు టోకరా

వర్తకులను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

లోపలి పేజీలో



ఆలయాల్లో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమలకు పోటెత్తిన భక్తులు

కిటకిటలాడిన గుబ్బల మంగమ్మ గుడి

క్రైమ్ సమాచారం

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య తలెత్తిన గొడవల నేపథ్యంలో భర్త పురుగుల మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన కంకిపాటి రమేష్(28)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో ఈనెల 24వ తేదీ రాత్రి పురుగుల మందు తాగాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. అతడి మరణాన్ని అనుమానాస్పద మృతిగా తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం,మే 25 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తితో పెళ్లి చేసినందుకు మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో జరిగింది. హెచ్‌సీ ఉమా మహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన గారపాటి మంగరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె గారపాటి రమాదేవి(21)కి రెండు సంబంధాలు వచ్చినప్పటికీ కుదరలేదు. ఎనిమిది నెలల క్రితం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన కప్పల మంగరాజుతో తన కుమార్తె రమాదేవికి వివాహం జరిపించారు. మతి స్థిమితం సరిగా లేని వ్యక్తిని తనకిచ్చి వివాహం చేశారని, మనస్తాపంతో ఈనెల 13న వేగవరంలో కలుపుమందు తాగింది. స్థానికులు గమనించి ఆమెను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 24న మృతి చెందింది. మృతురాలి తండ్రి గారపాటి మంగరాజు ఫిర్యాదు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

గొరగనమూడి వాసి అనుమానాస్పద మృతి

భీమవరం క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి ఇంటికి వెళ్లిన ఒక వ్యక్తి గుండెపోటుతో మృతి చెందినట్టుగా వన్‌టౌన్ ఎస్‌ఐ కృష్ణాజీ తెలిపారు. పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామానికి చెందిన వేంద్ర రవికుమార్ (38) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అప్పుడప్పుడూ భీమవరంలో ఉన్న తన స్నేహితురాలి ఇంటి వద్దకు వెళుతూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం కూడా స్నేహితురాలి ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ గుండెపోటు రావడంతో ఆమె వెంటనే ఆసుపత్రికి తరలించింది. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీనిపై మృతుడి భార్య ఏసుమణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

మొగల్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి):పేరుపాలెం సాగరతీరంలో ఆదివారం సముద్ర స్నానానికి దిగిన ఒక యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంకు చెందిన 25 ఏళ్ల వేదాల అజయ్ అనే యువకుడు తన మిత్రులతో కలిసి పేరుపాలెం సాగరతీరంలో గడిపేందుకు వచ్చాడు. స్నేహితులతో కలిసి సముద్రస్నానానికి దిగి స్నానం చేస్తుండగా అలల ఉధృతికి కొట్టుకుపోయాడని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న మొగల్తూరు పోలీసులు సముద్ర తీరానికి వెళ్లి యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బైక్‌ను ఢీకొట్టిన వ్యాన్.. మహిళకు తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వెళ్తున్న మహిళను వ్యాను ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామానికి చెందిన కొడమంచిలి మోజెస్ అతడి తల్లి మేరీ కలిసి శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై భీమవరం వస్తున్నారు. అన్నపూర్ణ థియేటర్ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వ్యాన్ వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో మేరీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించారు. కుమారుడు మోజెస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

తల వెంట్రుకలు చోరీ

ఏలూరు క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి):ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటితాళాలు పగులగొట్టి ఇంట్లోని తల వెంట్రుకలు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలోని సాయన్నపేటకు చెందిన కటారి వేములు తల వెంట్రుకల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఈనెల 13వ తేదీన తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లి తిరిగి ఆదివారం వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూడగా ఇంట్లో ఉన్న సుమారు రూ. లక్ష విలువైన 150 కేజీల తల వెంట్రుకలను దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సీహెచ్‌కె దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల పేరుతో రూ.85 వేలు టోకరా

- రెండు నెలల క్రితం ఒకసారి రూ.40 వేలు తస్కరణ
- వర్తకులను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

మొగల్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు వర్తకులను టార్గెట్ చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో మామిడి పండ్ల వర్తకుడు దూసనపూడి రాజుకు ఒక ఫోన్ వచ్చింది. తాను ఏఎస్‌ఐ ఆనందరావును అని తన మేనకోడలుకు ఒంట్లో బాగుండలేదు ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆసుపత్రికి డబ్బులు అర్జంటుగా ట్రాన్స్‌ఫర్ చేయాలని, నగదు రూపంలో అందిస్తానని కోరాడు. రాజు తన ఫోన్‌పేలో కూడా డబ్బులు లేవని మొగల్తూరులో గల మినీ ఏటీఎంలో డబ్బులు జమ చేస్తే ఫోన్‌పే చేయవచ్చని సదరు వ్యక్తికి సలహా ఇచ్చాడు. అక్కడ ఏటీఎం పని చేయడం లేదని అర్జంట్‌గా డబ్బులు ఫోన్‌పే చేసేవారి పేరు చెప్పాలని సూచించడంతో కూరగాయల మార్కెట్‌లో గల ముక్కు పురుషోత్తం అనే వర్తకుడు ఫోన్ నంబర్ ఇచ్చాడు. ఈ విషయాన్ని ఆ వర్తకుడుకి ఫోన్ ద్వారా తెలిపాడు. సదరు వర్తకుడికి ఆనందరావు ఫోన్ చేసి రూ.85వేలు తాను మాట్లాడుతున్న 79930 14578 నంబర్‌కు ఫోన్ పే చేసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి డబ్బులు తీసుకువెళ్లాలని సూచించాడు. ఫోన్‌పే చేసిన అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫోన్ చేయగా తాను మొగల్తూరు సినిమా హాల్ సెంటర్‌లో ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లగా ఎవరూ లేరు. మోసపోయానని తెలుసుకుని పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసుని వివరణ కోరగా తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.

రెండునెలల క్రితం మొగల్తూరు పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నాం ఎస్‌ఐ బంధువులను ఆసుపత్రిలో పెట్టారు. అర్జెంటుగా రూ.40 వేలు ఈ నంబరుకు ఫోన్ పే చేయండి, మీకు కాసేపట్లో డబ్బులు అందిస్తామంటూ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే సిమెంట్ వరలు వ్యాపారం చేసుకునే వర్తకుడికి ఫోన్ రావడంతో నిజమనుకున్న సదరు వ్యాపారి ఫోన్‌పే చేసి మోసపోయాడు. ఈ విధంగా మొగల్తూరు వర్తకులనే టార్గెట్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న వరుస ఘటనలపై మొగల్తూరులో చర్చనీయాంశమైంది.

సర్‌ప్లస్ టీచర్లలో 'బదిలీ' ఆందోళన

- సవరణ జీవోల జారీలో జాప్యంతో ఇబ్బందులు
- ఏలూరు డీఈవో కార్యాలయం ఎదుట టీచర్ల ఆందోళన


ఏలూరు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తరగతిలో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండో సెక్షన్‌ను మంజూరు చేయడంతోపాటు, ఆ మేరకు ఇప్పటికే జరిగిన సర్‌ప్లస్ పోస్టుల సర్దుబాటును సవరించడానికి అవసరమైన సవరణ జీవోల విడుదలలో జాప్యం అయింది. ఈవిధంగా ఏర్పడిన సంక్షోభాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు డీఈవో కార్యాలయం వద్ద టీచర్లు ఆందోళనకు దిగారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు టీచర్లు, సంఘ నాయకులు పాల్గొన్నారు. సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం సవరణ జీవోలు జారీ చేసిన వెంటనే ఉమ్మడి జిల్లాలో బదిలీకి దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లను సర్‌ప్లస్/ సర్దుబాటు నుంచి తప్పిస్తామని, వారి ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్లను రద్దుచేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు భరోసా ఇవ్వడంతో సమస్య సానుకూలంగా పరిష్కారమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. టీచర్ల బదిలీలపై ప్రభుత్వం తొలుత జారీచేసిన జీవో ప్రకారం ఉమ్మడి జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మార్గదర్శకాల మేరకు సబ్జెక్టుల వారీగా టీచర్లను గుర్తించి, సంబంధిత పోస్టులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఈవిధంగా సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లుగా మొత్తం 24మందిని విద్యాశాఖ గుర్తించింది. నిబంధనల ప్రకారం సర్‌ప్లస్ ఉపాధ్యాయులందరూ బదిలీకి దరఖాస్తుచేయడానికి శనివారం అర్ధరాత్రితో గడువు ముగుస్తుందని తొలుత ప్రకటించారు. అయితే విద్యార్థుల సంఖ్య 49 దాటినచోట్ల రెండోసెక్షన్ ఇచ్చేందుకు ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన చర్చల సందర్భంగా అంగీకారం తెలిపింది. కానీ ఇంతవరకు సవరణ జీవోలు విడుదల కాకపోవడంతో తొలుత గుర్తించిన 24మంది స్కూల్ అసిస్టెంట్లను తప్పనిసరిగా బదిలీ దరఖాస్తు చేయాల్సిందిగా జిల్లా విద్యాశాఖ నేరుగా సంబంధిత టీచర్లకు శనివారం రాత్రి ఫోన్లుచేసి ఆదేశించడంతో సమస్య తలెత్తింది. రాత్రివేళ ఫోన్‌చేసి బదిలీ దరఖాస్తుకు ఒత్తిడి చేయడంపై యూటీఎఫ్ తీవ్ర అభ్యంతరం లేవనెత్తగా, ఆ మేరకు ప్రభుత్వంనుంచి సవరణ జీవోలు అందకపోవడం, బదిలీ దరఖాస్తు సమయం ముగిసిపోతుండంతో నిబంధనల ప్రకారం ఆయా ఉపాధ్యాయులను సంప్రదించామని విద్యాశాఖవర్గాలు వివరణ ఇచ్చాయి.



స్కూల్ అసిస్టెంట్ల అప్లికేషన్లు రద్దు : డీఈవో

డీఈవో కార్యాలయంలో అధికార, యూటీఎఫ్ వర్గాల నడుమ ఆదివారం కొద్దిసేపు వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. రెండో సెక్షన్‌పై సవరణ జీవోలు వచ్చిన వెంటనే సర్‌ప్లస్ పోస్టుల సర్దుబాటులో మార్పులు చేయడంతోపాటు, ఇప్పటికే బదిలీ దరఖాస్తు చేసుకున్న 24మంది స్కూల్ అసిస్టెంట్ల అప్లికేషన్లను రద్దు చేస్తామని డీఈవో వెంకటలక్ష్మమ్మ హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. చర్చల అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య 50కు రెండో సెక్షన్‌ను అమలు చేయడానికి, ఆ మేరకు గుర్తించిన సర్‌ప్లస్ పోస్టులను సరిచేయడానికి విద్యాధికారులు హామీ ఇచ్చారని వివరించారు. చర్చల్లో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు షేక్‌ముస్తఫా అలీ, విజయ రామరాజు, సుభాషిణి, పట్టాభిరామయ్య, రంగమోహన్, శ్రీధర్, కమల్‌కుమార్, రత్నరాజు, ప్రసాద్, మోహన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం




శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ.. గుర్వాయిగూడెంలో మద్ది ఆంజనేయ స్వామి తెప్పోత్సవం.. గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మార్మోగిన శ్రీవారి నామస్మరణ

భక్తులతో వేంకటేశ్వరస్వామి క్షేత్రం రద్దీ

ద్వారకాతిరుమల, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా.. గోవిందా శ్రీవెంకటేశా గోవిందా అంటూ గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మారుమ్రోగింది. ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో పోటెత్తింది. అందరికీ సెలవు రోజు కావడంతో పాటు సప్తమి తిథి మంచిది కావడంతో ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు భ క్తులతో కిటకిటలాడాయి. అలాగే కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. షుమారు 12 వేల మందివరకూ యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

- క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తులను పరవశింపచేసింది. లోక కల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివయ్యకు అర్చకులు, పండితులు రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి ఓ వాహనంపై శివయ్యను, అమ్మవార్లను ఉంచి అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా మద్ది ఆంజనేయుడి తెప్పోత్సవం

జంగారెడ్డిగూడెం, మే 25 (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెంలో ఉన్న మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 21 నుంచి జరుగుతున్న శ్రీహనుమద్ జయంతి సహిత కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం వేకువజాము నుంచి స్వామి వారి ఆలయంలో ప్రభాత సేవ, నిత్యార్చన, ప్రధాన హోమాలు, దీక్ష విరమణ అనంతరం స్వామికి అభిషేకం, ధ్వజారోహణ, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఆలయ పుష్కరిణిలో వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను అసిస్టెంట్ కమిషనర్, ఈవో ఆర్‌వి.చందన పర్యవేక్షించారు.

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తులు కిటకిట

బుట్టాయగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి): వన దేవత శ్రీగుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కిటకిటలాడారు. వర్షాలు అధికంగా కురిస్తే అమ్మవారిని దర్శించుకోవడానికి అవకాశం ఉండనందున వాతావరణం పొడిగా ఉన్నప్పుడే అమ్మవారిని దర్శించుకోవాలని భక్తులు భావించి ఆలయానికి అధికంగా తరలివస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను కమిటీవారు పర్యవేక్షించారు.


ముత్యాలమ్మ ఆలయం వద్ద విద్యుత్‌కాంతులు

బండి ముత్యాలమ్మ జాతర ప్రారంభం

మొగల్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : ప్రతీ మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభమైంది. జాతర సంప్రదాయం ప్రకారం ఈనెల 4న అమ్మవారిని పూరిపాక వేసి నిలబెట్టారు. ఈనెల 7వ తేదీ రాత్రి గ్రామ కరణం కుటుంబ సభ్యులు చెన్నాప్రగడ వంశస్తులు అఖండ జ్యోతి వెలిగించి జాతర ప్రారంభించారు. ఈనెల 8 నుంచి ఆలయ పరిధిలో నాలుగు పంచాయతీలలోనూ ప్రతీ ఇంటికి అమ్మవారి అఖండ జ్యోతిని తీసుకువెళుతున్నారు. జాతర సందర్భంగా ఆలయ పరిధిలో భారీ స్వాగత ద్వారాలు, విద్యుత్ దీపాలంకరణలతో భారీ పందిళ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 25 నుంచి వచ్చే నెల 8 వరకు.. రోజుకు రెండు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పూజలు చేశారు. తొలిరోజు శివలీలలు హరికథ కాలక్షేపం, రాత్రి గణపతి మహత్యం నాటకాన్ని ప్రదర్శించారు. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ కొల్లాటి బాలకృష్ణ, పాలకమండలి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో డి.రామకృష్ణంరాజు ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ నాయకర్


ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా నూతన కమిటీ సభ్యులు

పశ్చిమ గోదావరి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ
జిల్లా అధ్యక్షుడిగా మోహనరావు

భీమవరంటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా యూనిట్ కార్యవర్గ కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. ఆదివారం భీమవరంలో జరిగిన సమావేశంలో కార్యవర్గ కమిటీ పదవులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా వై.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్‌కే ఉమర్ ఆలీషా, ఉపాధ్యక్షులుగా జీవీ రామనాగు, ఎస్.మానస, ఎంవీ లక్ష్మీనారాయణ, ఎం.సదాశివ ప్రసాద్, కె.కనకరాజు, ఎం.వెంకటేష్, ఎం.సాయిబాబా, వి.రాజేష్‌కుమార్, కార్యదర్శిగా జి.జక్కరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌వీఎస్‌వాసు పులగండం, సహాయ కార్యదర్శిగా ఎం.డి. అస్గర్ అలీ, సహాయ కార్యదర్శులుగా కె.మాణిక్యాలరావు, సీహెచ్ రాజేష్, జి.నారాయణ, జి.ప్రసాద్, ఎం.పద్మిని, కోశాధికారిగా పి.నాగభూషణం ఎంపికయ్యారు. ఎన్నికల అధి కారిగా సీహెచ్.పాపారావు, సహాయ ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.కేదారీశ్వరరావు, ఎన్నికల పరిశీలకుడిగా భూపతిరాజు రవీంద్రరాజు వ్యవహరించారు. వీరిచేత ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులను, రాష్ట్ర నాయకులు అభినందించారు.


భీమవరం లూథరన్ హైస్కూలులో 1975లో పదో తరగతి చదివిన విద్యార్థులు

పూర్వ విద్యార్థుల 'అపూర్వ' కలయిక

- అర్ధశతాబ్దం తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

భీమవరంటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కుల మత బేధం చూడనిది.. పేద, ధనిక బేధం పట్టించుకోనిది, బంధుత్వాల కంటే చాలాగొప్పది స్నేహం ఒక్కటే.. అంటూ 50 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలిశారు. లూథరన్ హైస్కూల్ 1975లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్దులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు 20 మందిని సత్కరించుకున్నారు. ఒకరిని ఒకరు పలురించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను మధుర స్మృతులుగా పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులైన తటవర్తి భాస్కరరావు, నంబూరి మాధవ, సుజ్ఞానరాజు, బెల్షాజర్, గోపా సత్యనారాయణ కొంతమంది మిత్రులు కలిసి కొన్ని నెలలుగా అందరినీ కలుపుకుని సమ్మేళనం నిర్వహించారు.

'టార్గెట్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనాలి'

నరసాపురం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమిచ్చే టార్గెట్‌తో సంబంధం లేకుండా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం పట్టణంలోని పలు గ్రామాల్లో పర్యటించి అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల్ని పరామర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అరుగాలం కష్టించి సాగు చేసిన రైతులకు ధాన్యం అమ్ముకునేందుకు దిక్కులేదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వెళ్లి అడిగితే టార్గెట్ పూర్తయిందని చెప్పడం దారుణమన్నారు. ప్రభుత్వం రైతుల నుంచి మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు డిమాండ్ చేశారు.

క్రీడా సమాచారం


క్రీడాకారులతో తలపడుతున్న అభిషేక్

శభాష్.. అభిషేక్

- ఏకకాలంలో 24 మందిని ఓడించిన ఏలూరు చెస్ క్రీడాకారుడు

ఏలూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి) : ఏలూరుకి చెందిన చెస్ క్రీడాకారుడు తన ప్రతిభతో ఒకేసారి 25 మందితో ఆడి 24 మంది ఆటగాళ్లను ఓడించాడు. అంతర్జాతీయ రేటెడ్ చెస్ క్రీడాకారుడు ఏలూరుకు చెందిన గంజి అభిషేక్ అవ్రహం ఈ ఘనత సాధించి ఔరా అనిపించాడు. స్థానికంగా ఆదివారం అబ్రహం గ్యారీ కాస్పరోవ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో సైమల్ టెన్నిస్ ఎగ్జిబిషన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఇప్పటివరకు ఆంధ్ర, తెలంగాణలో రాష్ట్రాల్లో నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం ఏలూరులో నిర్వహించారు. 25 మంది చదరంగం క్రీడాకారులతో 12 ఏళ్ల గంజి అభిషేక్ ఏకకాలంలో 25 మందితో చెస్ ఆడాడు. 24 మందిని ఓడించి ఒకరితో డ్రాగా ముగించాడు. చెస్ పోటీలను ప్రముఖ వ్యాపారవేత్త ఎం.శ్యామ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ.సునీత పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అకాడమీ డైరెక్టర్ యోహనన్ పర్యవేక్షించారు.


ఆర్చరీ పోటీలకు ఎంపికైన భీమవరం విద్యార్థిని సూర్యహంసిని

ప్రపంచ ఆర్చరీ పోటీలకు హంసిని ఎంపిక

భీమవరంటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు భారత ఆర్చరీ జట్టు ఎంపికలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో 12వ తరగతి చదువుతున్న మదాల సూర్య హంసిని ఎంపికైంది. జట్టు ఎంపికలు ఈనెల 22 నుంచి 25వరకు పుణేలో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో హంసినితోపాటు మరో ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆగస్టు 17 నుంచి ఆగస్టు 25 వరకు కెనడాలోని విన్నిపెగ్‌లో జరగనున్న ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు గర్ల్స్ కేటగిరీలోని ఆర్చరీలో భారత జట్టుకు హంసిని ఎంపికైంది. మరో ఇద్దరు క్రీడాకారులు మహారాష్ట్రకు చెందిన ప్రీతిక, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వెరెన్యరాణా భారత జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హంసినిని, కోచ్ కమల్ కిషోర్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చేకూరి సత్యనారాయణ, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ జయరాజు అభినందించారు.



ఏలూరు కొత్తబస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

ఒంటరి పిల్లల సమాచారమివ్వండి

ఏలూరు క్రైం, మే 25(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ఒంటరిగా అనుమానాస్పదంగా లేదా ఎటువంటి ఆదరణలేని వారు కనిపిస్తే వెంటనే 15100కు కాని, 1098కు గాని సమాచారం ఇవ్వాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ వలంటీర్లు ప్రయాణికులకు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం' పురస్కరించుకుని ఆదివారం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు పారాలీగల్ వలంటీర్లు అవగాహన కల్పించారు. ఎవరైనా బాలలు నిరాదరణకు గురైనా, ఒంటరిగా ఉన్న అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వారికి ఆశ్రయం కల్పించి విద్య, వైద్యం, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జీవీ భాస్కరరావు, సంగీతరావు, ఎ.గంగాభవానీ, పారాలీగల్ వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితి సభ్యులకు చెక్కు

చింతలపూడి/లింగపాలెం, మే 25(ఆంధ్రజ్యోతి) : భోగోలు రిజర్వు ఫారెస్టులో జామాయిల్ సాగు చేసి కటింగ్ చేయగా వచ్చిన ఆదాయంలో 50 శాతం వన సంరక్షణ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ వన సంరక్షణ సమితి సభ్యులకు రూ.89 లక్షల 10 వేల 543 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కుమార్‌సింగ్, గరిమళ్ల చలపతిరావు, రాప్రోలు రామ్మోహన్‌రావు, వేంపాటి సత్తిబాబు, చలమాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు, రేపు అంతరాయం

పెదవేగి, మే 25(ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల నిమిత్తం కూచింపూడి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లో నిర్దేశించిన సమయంలో రెండ్రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. కూచింపూడితో పాటు న్యాయంపల్లి, గోవిందవారిగూడెం, కొప్పులవారిగూడెం పరిధిలో సోమ, మంగళవారాల్లో రెండ్రోజుల పాటు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



11వ రోజు రిలే నిరహార దీక్షల్లో పాల్గొన్న గిరిజనులు

ఏజెన్సీ అభ్యర్థులకు ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి

బుట్టాయగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని ఆదివాసీ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని కోరుతూ ఆదివాసీలు చేస్తున్న రిలే నిరహార దీక్షలు 11వ రోజుకు చేరుకున్నాయి. తెల్లం రాములు దీక్షలను ప్రారంభించగా వెంకటేశ్ మద్దతు తెలిపారు. ఆదివారం దీక్షల్లో పట్ల రమేశ్ రెడ్డి, కారం వాసు, సోదెం ముక్కయ్య, తెల్లం లక్ష్మణరావు, తెల్లం పోచమ్మ, కోటం సువర్ణ, మడకం సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడిగా కృష్ణ కిశోర్

జంగారెడ్డిగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా కొండ్రెడ్డి కృష్ణ కిశోర్‌ను నియమించినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకూ టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా ఉన్న రావూరి కృష్ణను టీడీపీ పట్టణ ముఖ్య సలహాదారుడిగాను నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే కార్యాలయంలో రావూరి కృష్ణ, కొండ్రెడ్డి కిశోర్‌లను ఎమ్మెల్యే రోషన్ కుమార్ అభినందించారు.



ఎన్నికైన మానవత నూతన కమిటీ సభ్యులు

మానవత నూతన కార్యవర్గం ఏకగ్రీవం

జంగారెడ్డిగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికి గానూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్టు మండలాధ్యక్షుడు ఎ.వి.రమణ మూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని గురవాయిగూడెం మానవత కార్యాలయంలో మానవత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా అల్లూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తుట్టగుంట మధు, కోశాధికారిగా మాధవరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, మహంకాళి రంగ ప్రసాద్, త్రిపుర రమేష్, దల్లి పెద వీర్రాజురెడ్డి, డి.కె.రెడ్డి, ఎలికే తాతారావు, డి.ఆంజనేయ రెడ్డి, టి.వి.ఎ.గోపాలరావు, కొండ్రెడ్డి సోమరాజు పాల్గొన్నారు.

చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తా : సొంగా

చింతలపూడి, మే 25(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నియోజకవర్గంలో కోకో పంట అధికంగా ఉన్నందున ఇందుకు సంబంధించిన చాక్లెట్ ఫ్యాక్టరీని పెట్టించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామంలో కోకో ప్లాంట్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కోకో అధికంగా సాగవుతోందని, అందుకు సంబంధించిన పరిశ్రమలు స్థాపించడానికి కృషి చేస్తానన్నారు. చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. సమావేశంలో కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, రైతు నాయకులు రామరాజు, మాజీ జడ్పీటీసీ రాధారాణి, ఉద్యానవన శాఖాధికారిణి ఎం.డి.ఫర్హిన్, తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ నూతన కార్యవర్గ సభ్యులు

లయన్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు

చింతలపూడి, మే 25(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సరానికి నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పంకజాక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ సేవల ద్వారా ఎందరికో సహాయం అందుతుందన్నారు. నూతన అధ్యక్షులుగా అడపా శ్రీనివాసరావు, కార్యదర్శిగా దుగ్గిరాల రామకృష్ణ, కోశాధికారిగా వి.రాజగోపాల్, కో-ఆర్డినేటర్‌గా చిల్లపల్లి విజయలక్ష్మి, లయన్స్ బోర్డు డైరెక్టర్స్ గోలి చంద్రశేఖరరెడ్డి, చిల్లపల్లి రామ్మోహన్‌రావు, ఎ.పవన్‌కుమార్, శివాజీ, చుండూరి అబ్బయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

రేపు నిర్వహించే యోగాపై అవగాహన

ఏలూరు టూటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రలో భాగంగా ఈ నెల 27న నిర్వహించే యోగా పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు, సచివాలయాల సిబ్బంది యోగాపై అవగాహన కలిగించాలన్నారు. యోగాంధ్ర యాప్‌లో ప్రజల పేర్లు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి) : గుంటూరులో జూన్ 5న జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా యూనిట్ ఎన్నికలు ఆదివారం స్థానిక ఏపీజీఈఏ జిల్లా సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ అనంతరం కార్యవర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. ఎన్నికల అధికారిగా ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కేదారేశ్వరరావు సహా ఎన్నికల అధికారిగా సచివాలయం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ వ్యవహరించారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా ఎస్.ఎస్.వి.రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా జె.గోవిందరావు, ఉపాధ్యక్షులుగా వై.ఎస్.సుందర్, పి.శ్రీనివాసరావు, ఎం.కిరణ్, డి.రవికుమార్, ఎస్.అప్పారావు, టి.ఆర్.రత్నకుమారి, కార్యదర్శిగా బంగారయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.స్వరాజ్యమని, జాయింట్ సెక్రటరీగా జి.విజయ, టి.రత్నకుమారి, డి.ప్రవీణ్ మీరా, ఎస్.వెంకటేశ్వరరావు, జి.జాన్‌బాబు, ఎ.సుభాష్, కె.శాంత కుమార్, ట్రెజరర్‌గా ఎం.డి.జాహిద్‌లను ఎన్నుకున్నారు.

మామిడి పండ్ల ధర పతనం

పడిపోయిన విక్రయాలతో వ్యాపారుల దిగాలు
కొనుగోలుదారుల కోసం ఎదురు చూపులు

ఏలూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి) : మామిడి పండ్ల ధర పతనమైంది. మార్కెట్‌కు మామిడి పండ్లు వచ్చినప్పటికీ కొనుగోలుదారులు రాకపోవడంతో వ్యాపారులు డీలాపడిపోతున్నారు. మామిడి పండ్ల ఎగుమతి, వాతావరణంలో మార్పులతో ధర సగానికి పడిపోయిందని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర మాత్రం అంతంత మాత్రంగానే ఉందని వారంటున్నారు. ఏలూరులోని అన్ని కూడళ్ల వద్ద స్థానిక ఆర్‌ఆర్‌పేట గో సంరక్షణ వద్ద ప్రతీ రోజు మామిడి మార్కెట్ ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 9గంటల వరకు సాగుతుంది. ఈ మార్కెట్‌కు నూజివీడు నుంచి రైతులు మామిడి పండ్లను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. గత కొద్ది రోజులుగా కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. కొనుగోలుదారుల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. అడపాదడపా వచ్చిన వారు కూడా తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దీంతో మామిడి పండ్ల ధరపడిపోయిందని రైతులు వాపోతున్నారు. గత వారం 30 పండ్లు ఉన్న ట్రే 500 నుంచి 600 వరకు విక్రయించామని, ఇప్పుడు అదే ట్రే రూ.300 కూడా రాలేదని వారు వాపోయారు. గత ఏడాది మామిడి దిగుబడి తక్కువగా



ఉన్నా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేదని, దీంతో స్థానికంగా మంచి ధర వచ్చిందన్నారు. ఈ ఏడాది ఎగుమతులు లేకపోవడంతో ఒక్కసారిగా ధర పతనమైందని వ్యాపారులు అంటున్నారు. వచ్చిన కాడికి విక్రయిస్తున్నారు.పరక 80 రూపాయల నుంచి 100 రూపాయిలకు బంగినపల్లి, పెద్ద, చిన్న రసాలు, వంద నుంచి 150 రూపాయలకు విక్రయిస్తున్నారు. మామిడి ధరను చూసిన రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 3.3 మి.మీ. వర్షపాతం నమోదు

ఏలూరుసిటీ, మే 25(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను ఉదయం ఎండ కనిపించినా సాయంత్రం అయ్యే సరికి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి.జిల్లాలోని ఏజెన్సీ మండలాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి.పలు ప్రాంతాల్లో భారీగాను, పలు ప్రాంతాల్లో స్వల్పంగాను ఈదురు గాలులు, పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 18.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 3.3 మిల్లీ మీటర్లుగా నమోదైంది.ఉపరితల ఆవర్తనం ప్రభావం కారణంగా ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని భీమడోలు, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం,



పెదపాడులో వర్షం కురుస్తున్న దృశ్యం

జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, కుక్కునూరు, ఉంగుటూరు, నిడమర్రు, పెదపాడు, పెదవేగి తదితర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. మరో వారం రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.



మహిళా గ్రంథాలయంలో పాల్గొన్న చిన్నారులు



కథలు వినిపిస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ

చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవరుచుకోవాలి

ఏలూరుటూటౌన్ / పెదవేగి / పెదపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని రిసోర్స్ పర్సన్ జి.వి.ఆనందరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు మహిళా గ్రంథాలయం, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. మహిళా గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ అనూరాధ తెలుగు పద్యాల పై అంత్యాక్షరి, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జీవీ.రమణ, ఎం.జగదీశ్వరి, గ్రంథపాలకురాలు యాగంటి శ్రీదేవి, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, రమేశ్, ఎం.డి.అస్లాంపాష పాల్గొన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రామశింగవరం హైస్కూల్ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ కథలను చదివి, వాటిలో నీతిని తెలియపర్చారు. గ్రంథపఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. పెదపాడులో గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు విద్యార్థులకు భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. క్షిపణి శాస్త్రవేత్తగా అబ్దుల్ కలాం చేసిన కృషిని వివరించారు. అనంతరం పలు నీతికథలను చదివి వినిపించారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోకుల పారిజాతగిరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



పుష్పయాగ మహోత్సవం

జంగారెడ్డిగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఉన్న శ్రీగోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం స్వామికి జరిగిన ధృవమూర్తి విశేషాభిషేకం,ద్వాదశ ఆరాధన, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్టు ఈవో మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.జగపతిరాజు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌ను ఆపాలని నిరసన

కుక్కునూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ ఖగార్ పేరుతో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తోందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంధ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు ఆరోపించారు. ఆదివారం మారేడుబాక గ్రామంలో డివిజన్ కార్యదర్శి స్వయం చంద్రరావు అధ్యక్షతన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సదస్సు నిర్వహించారు. అనంతరం ఆపరేషన్ ఖగార్‌ను ఖండిస్తూ నిరసన తెలిపారు.ఇప్పటి వరకు జరిపిన కాల్పుల్లో 500 మం దికి పైగా గిరిజనులు, 100 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు తెలిపారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కర్రెగుట్ట అడవుల్లో ఉన్న సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నా రని ఆరోపించారు. ఒరిస్సా ఆసుపత్రిలో ఉన్న కామ్రేడ్ నంబాల కేశవరావును పట్టుకుని భూటకపు ఎన్‌కౌం టర్ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.వీరాస్వామి, కె.ముత్యాలరావు, కెకల్లయ్య, పి.శ్రీను, మిరియాల సుజాత పాల్గొన్నారు.



మారేడుబాక గ్రామంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, మే 25(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంటలో కొలువైన రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్ కుమార్ తెలిపారు.



దేవదాయ శాఖపై ఎమ్మెల్యే సమీక్ష

ఉంగుటూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో దేవదాయ శాఖకు సంబంధించి వివిధ అంశా లపై అధికారులతో ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమీక్షించారు. దేవదాయ శాఖకు సంబంధించిన ఆస్తుల వివరాలు, గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, శ్రీవాణి పథకం ద్వారా కొత్తగా నిర్మించనున్న దేవాలయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో రేషన్ పంపిణీ విధానంపై డీలర్లకు తగిన సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం గెడ్డపల్లిలోని ధారవాడ గ్రామానికి చెందిన కెచ్చెల సీతారెడ్డి అనే విభిన్న ప్రతిభావంతుడు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండు వద్ద ఈ నెల 24న తప్పిపోయాడు. వదిన నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. సీతారెడ్డి విభిన్న ప్రతిభావంతుడు కావడంతో సదరం సర్టిఫికెట్ కోసం ఏలూరు తీసుకొచ్చి డాక్టర్ల పరీక్షల అనంతరం అదే రోజు తిరిగి జంగారెడ్డిగూడెం బస్టాండుకు చేరుకున్నారు. బస్టాండు వద్ద సీతారెడ్డి తప్పిపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఏలూరు రూరల్/టి.నరసాపురం, మే 25(ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని శ్రీశ్రీ పాఠశాలలో టెన్త్ చదివి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఎంబీఎస్ శర్మను పూలమాలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసు కుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. టి.నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06లో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోటకు చేరి ఆటపాటలతో



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గడిపారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు.



పూలమాల వేస్తున్న నూతన టీడీపీ కమిటీ సభ్యులు

టీడీపీ కొవ్వలి గ్రామ కమిటీ ఏకగ్రీవం

దెందులూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : కొవ్వలి టీడీపీ గ్రామ కమిటీ ఏకగ్రీవ మైనట్టు దెందులూరు మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, ఎన్నికల నిర్వహణ పరిశీలకులు వీరమాచినేని ప్రభాకర్ ఆదివారం తెలిపారు. కొవ్వలి గ్రామాధ్యక్షుడిగా బగాతి చిన్నారావు, ఉపాధ్యక్షుడిగా గోవాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బోడ రాజకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పప్పుల రవికుమార్, గంటా ప్రభాకర్, వీర్ల శ్రీనివాస్, కార్యదర్శులుగా నెర్సు శివాజీ బూర్ల వెంకటేశ్వరరావు, సత్తెనపల్లి నాగరాజు, మద్దేల రాజారావు, టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడిగా కొటారి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా అందుగుల నవీన్, ఐటీడీపీ అధ్యక్షులుగా సురిలేటి సురేశ్ కుమార్, కార్యదర్శి ననపల రాజేశ్, తెలుగు రైతు విభాగం అధ్యక్షుడిగా గుత్తా శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.నాగార్జునలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నారాయణ ప్రసాద్ తెలిపారు.



క్రికెట్ కిట్ అందజేస్తున్న వెంకట కృష్ణయ్య

యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

పెదపాడు, మే 25(ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని వల్లూరి సుష్మ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వల్లూరి వెంకట కృష్ణయ్య తెలిపారు. పెదపాడు శివారు రామచంద్రపురం యువకులకు రూ.10 వేల విలువ చేసే క్రికెట్ కిట్‌ను సుష్మ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి సుభద్రాదేవి పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో ఉచిత వైద్య శిబిరం

టి.నర్సాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : బొర్రపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫర్ దా పీపుల్ ఆధ్వర్యంలో విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వైద్య బృందంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బొమ్మగాని బాల కృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫర్ దా పీపుల్ యూత్ కన్వీనర్ కలపర్తి విజయ్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్, గుండె వ్యాధులకు సంబంధించిన 190 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందు లు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఉచిత వైద్య శిబిరా లు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతగానో దోహదపడతా యని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీర్రాజు, సూర్య, సురేశ్, రాజేశ్, అనీల్ పాల్గొన్నారు.



నిర్వహిస్తున్న వైద్య శిబిరం

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఏలూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకపోవడంతో అనేక పేద బ్రాహ్మణ కుటుంబాలు దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్టు పేర్కొన్నారు. 2016 బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబాలకు ఎంతో మేలు చేశారని, అదే తరహాలో మళ్లీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తోడ్పాటు నందించాలని కోరారు.

నేడు హుండీ లెక్కింపు

పెదపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ ఈవో తారకేశ్వరరావు తెలిపారు. దేవాలయ అధికారులు, సిబ్బంది, పాలక మండలి, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని, ఆసక్తి ఉన్న భక్తులు దేవాలయ ప్రాంగణంలో జరిగే హుండీ లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

నల్ల మారెమ్మగా గంగానమ్మ

ఏలూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి) : జాలిపూడి గ్రామంలో గంగానమ్మ జాతర గత నెల 14వ తేదీ నుంచి వైభవంగా జరుగుతోంది. జాతరలో భాగంగా ఆదివారం నల్ల మారెమ్మగా గంగానమ్మ దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున కుంభం పోసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఘటాలను మేళతాళాలు మంగళ వాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

ఏలూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్రంపాడులోని ఎన్టీయార్ విగ్రహం వద్ద పాదచారులకు మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులు కోటేశ్వరరావు వాకర్స్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఆదినారాయణ, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సెక్రటరీ వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

చింతలపూడి, మే 25(ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలో జూలై 5, 6, 7 తేదీల్లో జరిగే జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి టి.బాబు పిలుపునిచ్చారు. పాత చింతలపూడిలో సీపీఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల చరిత్రను గ్రామగ్రామాన చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు కంచర్ల గురవయ్య, డి.కృష్ణ, టి.రాజు, వజ్రం పాల్గొన్నారు.



భోజనం పంపిణీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆస్పత్రిలో ఉచిత భోజనం

భీమడోలు, మే 25(ఆంధ్రజ్యోతి) : రోగులకు అందించే ఆహారం శుభ్రంగా ఉండాలని భీమడోలు సామాజిక కేంద్రం సూపరింటెండెంట్ సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వచ్చే రోగులకు ఉచిత భోజన సదుపాయాన్ని ఆదివారం సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం భీమడోలు సామాజిక వైద్య కేంద్రంలో భోజన పంపిణీ ప్రభుత్వం నిర్దేశం ప్రకారం పంపిణీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య కేంద్రం అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం, వాసు, ఏఎంసీ చైర్మన్ శేషపుగిరి, దోసపూడి పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.



తూరను గూడుగా ఏర్పాటు చేసిన దృశ్యం

ట్రాక్టర్‌కు ఓ గూడు!

జీలుగుమిల్లి, మే, 25(ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వచ్చిందంటే కారు, ట్రాక్టర్, మోటర్ సైకిల్ ఇలా ఇంటి వద్ద తమ వాహనాలు తడవకుండా జాగ్రత్తపడటం సహజమే కాని ఓ రైతు తన వినూత్న ఆలోచనతో ట్రాక్టర్‌ను వర్షానికి తడవకుండా తూరలో భద్రపరిచాడు. రోడ్డు నిర్మాణ క్రమంలో కనకాపురంలో రహదారి పక్కన పెద్ద తూరలు ఉంచారు. ఇటీవల వర్షాలు అధికంగా కురవడంతో ట్రాక్టర్ ఇంజన్ వర్షానికి తడవకుండా జాగ్రత్తలు పాటించాడు.

మానవత మండలాధ్యక్షుడిగా కోనే

ఉంగుటూరు,మే 25(ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన అధ్యక్షుడిగా కైకరం గ్రామానికి చెందిన కోనే వీర వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మెన్ సాగిరాజు జానకిరామరాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా దొంతల విజయ కుమార్, కార్యదర్శిగా రాజాని సతీశ్, కోశాధికారిగా గంజి రవి కుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

మహానాడును విజయవంతం చేయండి

కైకలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగే టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు కోరారు. ఆదివారం ఆయన కైకలూరులో మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించే తెలుగుదేశంపార్టీ పండుగను కడపలో నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండేగాక కైకలూరు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ మహానాడులో తీసుకునే నిర్ణయాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తూచా తప్పకుండా పాటిస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, సాయంత్రం 3గంటల నుంచి 6గంటల వరకు కొత్త విద్యుత్‌లైన్లు ఏర్పాటుచేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పెద్దింట్లమ్మకు భక్తుల తాకిడి




కైకలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులను చెల్లించుకున్నారు. కొల్లేటికోటలో ఎక్కడ చూసినా భక్తుల సందడితో కిటకిటలాడింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ ఉచితంగా మంచినీటిని అందించి భక్తులకు వసతులను కల్పించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సంతాన నాగేంద్రస్వామికి లక్షమల్లెల పూజ



కైకలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్యాంప్ డ్రెయిన్ గట్టుపై ఉన్న శ్రీసంతాన నాగేంద్ర స్వామికి లక్షమల్లెల అర్చన అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ అర్చకులు చావలి శంకరశాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆలయంలో గణపతి, శ్రీమయూర వాహన, వేంకటేశ్వర, వాల్మీకి సహిత ఆనందలింగేశ్వరస్వామివార్లకు మల్లెపూలతో విశేషపూజలను నిర్వహించారు. కైకలూరు శ్రీమన్నారాయణగోష్ఠి అధ్యక్షురాలు సీహెచ్ హేమలత ఆధ్వర్యంలో పారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆంజనేయుడికి పూజలు.. అన్నసమారాధనలు



వడాలి అభయాంజనేయస్వామి ఆలయంలో టీడీపీ కన్వీనర్ నరసింహారావు, మహిళలు పూజలు

ముదినేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ముదినేపల్లిలోని సువర్చలా సమేత భక్తాంజనేయస్వామి దేవస్థానం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నసమారాధనలో సుమారు 3 వేల మంది పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. సంఘ నాయకులు మాడుగుల పూర్ణ, వత్తుమిల్లి ప్రసాద్, కురిచేటి తిరుమల శ్రీనివాస్ అన్నసమారాధన ఇతర పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. వడాలిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా నిర్వహించిన అనంతరం టీడీపీ కైకలూరు నియోకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, చాలీసా నిర్వహించిన మహిళలు పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

టీచర్ల బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

ముదినేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. సీనియర్ టీచర్లకు బదిలీల్లో సర్వీస్ పాయింట్లను కలిపే విషయంలో ముందుకు రాని విద్యాశాఖ ఉన్నతాధికారులు వెబ్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించాలని కోరారు. ఖాళీలను గుర్తించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రస్తుత సమయంలో ఉపాధ్యాయుల బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించటంలో అర్థం లేదని విమర్శించారు. పాత విధానాన్ని అమలు చేయవద్దని కోరుతూ అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా వెబ్ కౌన్సెలింగ్‌ను సాధించేందుకు కృషి చేయాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు.

నూజివీడులో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం

నూజివీడు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు పరిసర ప్రాంతాల్లో గత 24 గంటల్లో 2.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గం వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆగిరిపల్లి మండలంలో 8.2, ముసునూరు మండలంలో 7.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

పిడుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, మే 25 (ఆంధ్రజ్యోతి): పిడుగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. రాబోయే మూడు రోజులు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తాటిచెట్లు, కొబ్బరి చెట్లు కింద ఉండరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఉండే పశువుల కాపర్లు సురక్షిత ప్రదేశాల్లో ఉండాలన్నారు. కలిదిండి మండలంలో పలు గ్రామాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

తల వెంట్రుకలు చోరీ

ఏలూరు క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి):ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటితాళాలు పగులగొట్టి ఇంట్లోని తల వెంట్రుకలు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలోని సాయన్నపేటకు చెందిన కటారి వేములు తల వెంట్రుకల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఈనెల 13వ తేదీన తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లి తిరిగి ఆదివారం వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూడగా ఇంట్లో ఉన్న సుమారు రూ. లక్ష విలువైన 150 కేజీల తల వెంట్రుకలను దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సీహెచ్‌కె దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోణీ కాలేదు

నిరుపయోగంగా మినుము కొనుగోలు కేంద్రం.. నిబంధనలతో ముందుకు రాని రైతులు




దేవపూడిలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ మినుము కొనుగోలు కేంద్రం.. కొనుగోళ్ల నిబంధనల బ్యానర్

ముదినేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలం దేవపూడిలో ఏర్పాటు చేసిన మినుముల కొనుగోలు కేంద్రం నిరుపయోగంగా మారింది. ప్రస్తుత సీజన్‌లో ఈ కొనుగోలు కేంద్రంలో ఒక్క గింజ మినుము కొనుగోలు జరగలేదు. రైతులకు మినుము పంటకు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరను కల్పించే ఉద్దేశంతో మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రానికి మండలంలోని ఒక్క రైతు కూడ మినుము శాంపిల్స్ తీసుకురాలేదు. సుమారు నెల రోజుల క్రితం ఆ గ్రామంలోని పీఏసీఎస్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ మార్కెట్‌లో మినుము ధర గిట్టుబాటు కావటం లేదని, క్వింటాలుకు ప్రభుత్వం రూ.7400 మద్దతు ధర ప్రకటించినా వ్యాపారులు గరిష్ఠంగా రూ.6400లకు కొనుగోలు చేశారు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ప్రభుత్వం నిబంధనలే రైతులకు అడ్డంకిగా తయారయ్యాయి.

అన్నీ నిబంధనలే..

రైతులు తమ మినుములు ఈ కొనుగోలు కేంద్రంలో అమ్మాలంటే ముందుగా రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. ఆ నమోదు పత్రంలో కొనుగోలు కేంద్రానికి మినుముల శాంపిల్స్ తీసుకెళ్లాలి. కొనుగోలు కేంద్రం ఉన్న సహకార సంఘ సిబ్బంది తేమ, తప్ప శాతం పరిశీలించి ఇస్తే సిఫార్సుతో తిరిగి శాంపిల్స్‌ను కైకలూరు ఏఎంసీలోని మార్క్‌ఫెడ్ కేంద్రానికి వెళ్లి అక్కడ కూడా ఒకే చేయించుకోవాలి. ఈ ప్రాసెస్ అయ్యాక రైతులు తమ మినుములను దేవపూడి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి తూకం వేయించి మళ్లీ కైకలూరు గొడౌన్‌కు తరలించాలి. అక్కడ దిగుమతి అయ్యాక కొనుగోలు చేసిన మినుములకు మార్క్‌ఫెడ్ అధికారులు ఎంత మొత్తం వచ్చేది రశీదు ఇస్తారు. ఇదంతా పూర్తయ్యాక 15 రోజుల్లో రైతు ఖాతాకు సొమ్ములు జమ అవుతాయి.

ఇబ్బందులు పడలేక..

మార్క్‌ఫెడ్ కేంద్రానికి మినుములు అమ్మటంలో విధించిన నిబంధనలు ఇబ్బందిగా మారటంతో చిన్న, సన్నకారు రైతులతోపాటు పెద్ద రైతులు తమ మినుములను ప్రైవేట్ మార్కెట్‌లోనే అమ్మేశారు. క్వింటాలుకు రూ.800 నుంచి రూ.1000 తక్కువ వచ్చినా రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకే అమ్ముకున్నారు కానీ కొనుగోలు కేంద్రం వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో మినుము కొనుగోలు కేంద్రం నిష్ప్రయోజనమైంది. వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులు ఎంత ప్రచారం చేసినా మినుము రైతులు కొనుగోలు కేంద్రంపై ఆసక్తి చూపలేదు.

పోలవరం-యడవల్లి రహదారికి మోక్షం



పోలవరం-యడవల్లి మధ్య నిర్మాణం జరుగుతున్న బీటీ రహదారి

చాట్రాయి, మే 25(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలం పోలవరం-లింగపాలెం మండలం యడవల్లి గ్రామాల మధ్య రూ 1.90 లక్షలు నాబార్డు నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభం కావటంతో రెండు మండలాల ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దశాబ్దాల నుంచి ప్రజలు రైతులు ఈ రోడ్డు నిర్మించాలని ప్రజాప్రతినిదులను కోరుతుండగా ఇప్పటికి కార్యరూపం దాల్చింది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పోలవరం పీఏసీఎస్ అధ్యక్షుడు చెలికాని బాబ్జీ కృషితో ఈ రోడ్డుకు నిధులు మంజూరు కాగా, అప్పటి నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు ఈ రోడ్డు ఆవశ్యకతను మంత్రి పార్థసారథికి వివరించి పనులు ప్రారంభానికి కృషి చేశారు. ఈ రోడ్డు ఉపయోగంలోకి వస్తే చాట్రాయి మండల ప్రజలు జిల్లా కేంద్రం ఏలూరు వెళ్ళటానికి దగ్గర దారి ఏర్పడుతుంది. అంతే కాక ఈ రోడ్డులో చాట్రాయి, లింగపాలెం మండలాల రైతులకు కొన్ని వందల ఎకరాలు వ్యవసాయ భూములు ఉన్నాయి. అధ్వాన రోడ్డు వలన పంటలు తరలించటానికి, నిత్యం భూముల్లోకి వెళ్ళటానికి అన్నదాతలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డులో తమ్మిలేరు ఉంది. తమ్మిలేరుపై కాజ్‌వే నిర్మించాలని 60 ఏళ్ళ నుంచి ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఎన్నికలలోను నేతలు హామీలు ఇవ్వటమే కాని ఫలితం కలగలేదు. మంత్రి పార్థసారథి ఆదేశాలతో కొన్ని నెలల క్రితం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు కాజ్‌వే నిర్మాణాని రూ.6 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. రోడ్డు నిర్మాణంతో పాటు తమ్మిలేరుపై కాజ్‌వే కూడా నిర్మిస్తే రవాణా సౌకర్యాలు పెరిగి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలు అంటున్నారు.



పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

ముసునూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీపాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 2002-03 పదవ తరగతి పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి ఒక్కచోట కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వవిద్యార్థి మానికల గంగధరరావు, చీలి ఏలియా ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరిగింది.

గ్రంథాలయం ఆవరణ జలమయం



కలిదిండి, మే 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండటంతో కలిదిండి గ్రంథాలయం ఆవరణ జలమయమైంది. దీంతో వేసవి విజ్ఞాన శిబిరానికి వెళ్లే విద్యార్థులు, పాఠకులు అవస్థలు పడుతున్నారు. గ్రంథాలయం ఆవరణ పల్లంగా ఉండటంతో భారీ వర్షాలు కురిసినప్పుడు గ్రంథాలయ గదుల్లోకి వర్షపు నీరు చేరుతున్నది. న్యూస్ పేపర్లు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు తడిసిపోయే ప్రమాదం ఉందని పాఠకులు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి గ్రంథాలయం ఆవరణంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఆవరణం బురద కయ్యగా మారుతుంది. దీంతో దోమల బెడద కూడా ఉంటుందని పాఠకులు వాపోతున్నారు.

లారీ డ్రైవర్ దుర్మరణం



ముదినేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : లారీని రివర్స్ చేస్తుండగా గొడౌన్ గోడకు డ్రైవర్ తల తగిలి ప్రాణాలు కోల్పోయాడు. ముదినేపల్లి మండలం శ్రీహరిపురం ఏరియాలోని గ్రోవెల్ ఫీడ్ కంపెనీకి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి శనివారం ఆ కంపెనీ ఉత్పత్తులకు ముడిపదార్థమైన నూకల లోడుతో లారీ వచ్చింది. ఆ లారీలోని లోడును కంపెనీ గొడౌన్‌లో దింపేందుకు లారీని డ్రైవర్ షేక్ నాగుల్‌మీరా (30) కిటికీ నుంచి తలబయటకు పెట్టి వెనక్కి చూస్తూ లారీని రివర్స్ చేస్తున్నాడు. కొద్ది దూరం వెనక్కి వెళ్ళిన లారీ అనుకోకుండా ముందుకు కదిలిదింది. ఆ సమయంలో నాగుల్‌మీరా తల గొడౌన్ గోడకు తగిలింది. తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే అతనిని కంపెనీ యాజమాన్యం తమ వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం రాత్రి నాగుల్‌మీరా మరణించాడు. ఈ సంఘటనపై గ్రోవెల్ కంపెనీ హెచ్ఆర్ లింగారెడ్డి చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ముదినేపల్లి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాట్రాయి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఇజ్జిగాని?



చాట్రాయి, మే 25(ఆంధ్రజ్యోతి) చాట్రాయి మండల టీడీపీ అధ్యక్షుడుగా ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన ఇజ్జిగాని వెంకటేశ్వరావును ఖరారు చేశారు. కానీ అధికారికంగా ప్రకటన వెలువడవలసి ఉంది. శనివారం పార్టీ పరిశీలకుడు ఘంటా మురళీ గ్రామాల నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించగా అధిక శాతం మంది ఇజ్జిగానికి మద్దతు తెలిపినట్లు సమాచారం. దీనితో మంత్రి పార్థసారథి ఇజ్జిగానికి మండల అధ్యక్ష పదవికి ఇవ్వటానికి సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. 35 ఏళ్ళ నుంచి టీడీపీ క్రియాశీలక రాజకీయాలలో ఉన్న ఇజ్జిగాని వార్డు సభ్యుడుగా, కో-ఆపరేటివ్ డెరెక్టర్‌గా, గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా, మండల బీసీ సెల్ అధ్యక్షుడుగా, సర్పంచ్‌గా అనేక పదవులు నిర్వహించి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేశారు.

యర్రావారిగూడెంలో విషాదచాయలు



తిరుమలదేవి(ఫైల్)

చాట్రాయి, మే 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా తగరపువలస జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాట్రాయి మండలం కొత్తగూడెం శివారు యర్రావారిగూడెంకు చెందిన ఉప్పలపాటి తిరుమలదేవి(25) మృతి చెందటంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉప్పలపాటి అచ్యుతరామయ్య, పుష్పావతి దంపతుల కుమార్తె అయిన తిరుమలదేవి రెండు ఏళ్ళ నుంచి దివీస్ కంపెనీలో పీడీఎస్‌పి విభాగంలో కెమిస్టుగా పనిచేస్తున్నది. తన రూంమేట్స్‌తో కలిసి విధులకు వెళుతూ, రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఆమె మృత్యువాత పడటం అందరి కలిచివేస్తున్నది. ఆదివారం సాయంత్రం తిరుమలదేవి భౌతికకాయాన్ని యర్రావారిగూడెం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదనలు చూపరులకు కన్నీరు పెట్టించాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న తిరుమలదేవి మృతి తమను కలచివేస్తున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మికం





శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ.. గుర్వాయిగూడెంలో మద్ది ఆంజనేయ స్వామి తెప్పోత్సవం.. గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తులు

మార్మోగిన శ్రీవారి నామస్మరణ

భక్తులతో వేంకటేశ్వరస్వామి క్షేత్రం రద్దీ

ద్వారకాతిరుమల, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా.. గోవిందా శ్రీవెంకటేశా గోవిందా అంటూ గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మారుమ్రోగింది. ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో పోటెత్తింది. అందరికీ సెలవు రోజు కావడంతో పాటు సప్తమి తిధి మంచిది కావడంతో ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు భ క్తులతో కిటకిటలాడాయి. అలాగే కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండింది. షుమారు 12 వేల మంది వరకూ యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయప డుతున్నాయి. దర్శనానంతరం వారంతా స్వామి వారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

- క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తులను పరవశింపచేసింది. లోక కల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివయ్యకు అర్చకులు, పండితులు రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి ఓ వాహనంపై శివయ్యను, అమ్మవార్లను ఉంచి అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా మద్ది ఆంజనేయుడి తెప్పోత్సవం

జంగారెడ్డిగూడెం, మే 25 (ఆంధ్రజ్యోతి): గుర్వాయి గూడెంలో ఉన్న మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 21 నుంచి జరుగుతున్న శ్రీహనుమద్ జయంతి సహిత కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం వేకువజాము నుంచి స్వామి వారి ఆలయంలో ప్రభాత సేవ, నిత్యార్చన, ప్రధాన హోమాలు, దీక్ష విరమణ అనంతరం స్వామికి అభిషేకం, ధ్వజారోహణ, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహి ంచారు. సాయంత్రం స్వామి వారి ఆలయ పుష్కరి ణిలో వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తు లకు కావాల్సిన ఏర్పాట్లను అసిస్టెంట్ కమిషనర్, ఈవో ఆర్‌వి.చందన పర్యవేక్షించారు.

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తులు కిటకిట

బుట్టాయగూడెం, మే 25(ఆంధ్రజ్యోతి): వన దేవత శ్రీగుబ్బల మంగమ్మతల్లిని దర్శించు కోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కిటకిటలాడారు. వర్షాలు అధికంగా కురిస్తే అమ్మవారిని దర్శించుకోవడానికి అవకాశం ఉండనందున వాతావరణం పొడిగా ఉన్నప్పుడే అమ్మవారిని దర్శించుకోవాలని భక్తులు భావించి ఆలయానికి అధికంగా తరలివస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను కమిటీవారు పర్యవేక్షించారు.

శభాష్.. అభిషేక్..

» ఏకకాలంలో 24 మందిని ఓడించిన ఏలూరు చెస్ క్రీడాకారుడు



క్రీడాకారులతో తలపడుతున్న అభిషేక్

ఏలూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి) : ఏలూరుకి చెందిన చెస్ క్రీడాకారుడు తన ప్రతిభతో ఒకేసారి 25 మందితో ఆడి 24 మంది ఆటగాళ్లను ఓడించాడు. అంతర్జాతీయ రేటెడ్ చెస్ క్రీడాకారుడు ఏలూరుకు చెందిన గంజి అభిషేక్ అప్రహం ఈ ఘనత సాధించి ఔరా అనిపించాడు. స్థానికంగా ఆదివారం అబ్రహం గ్యారీ కాస్పరోవ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో సైమల్ టెన్నిస్ ఎగ్జిబిషన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఆంధ్రతెలంగాణలో రాష్ట్రాల్లో నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం ఏలూరులో నిర్వహించారు. 25 మంది చదరంగం క్రీడాకారులతో 12 ఏళ్ల గంజి అభిషేక్ ఏకకాలంలో 25 మందితో చెస్ ఆడాడు. 24 మందిని ఓడించి ఒకరితో డ్రాగా ముగించాడు. చెస్ పోటీలను ప్రముఖ వ్యాపారవేత్త ఎం.శ్యామ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ.సునీత పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అకాడమీ డైరెక్టర్ యోహనన్ పర్యవేక్షించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం,మే 25 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తితో పెళ్లి చేసినందుకు మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో జరిగింది. హెచ్‌సీ ఉమా మహేశ్వర రావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన గారపాటి మంగరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె రమాదేవి(21)కి ఎనిమిది నెలల క్రితం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన కప్పల మంగరాజుతో వివాహం జరిపించారు. మతి స్థిమితం సరిగా లేని వ్యక్తిని తనకిచ్చి వివాహం చేశారని, మనస్తాపంతో ఈనెల 13న వేగవరంలో కలుపుమందు తాగింది. విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 24న మృతి చెందింది. మృతురాలి తండ్రి మంగరాజు ఫిర్యాదు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

ఒంటరి పిల్లల సమాచారమివ్వండి

ఏలూరు క్రైం, మే 25(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ఒంటరిగా అనుమానా స్పదంగా లేదా ఎటువంటి ఆదరణలేని వారు కనిపిస్తే వెంటనే 15100కు కాని, 1098కు గాని సమాచారం ఇవ్వాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ వలంటీర్లు ప్రయా ణికులకు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'అంతర్జాతీ య తప్పిపోయిన పిల్లల దినోత్సవం' పురస్కరించుకుని ఆదివారం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్‌లో ప్రయాణి కులకు పారాలీగల్ వలంటీర్లు అవగాహన కల్పించారు. ఎవరైనా బాలలు నిరాదరణకు గురైనా, ఒంటరిగా ఉన్న అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వారికి ఆశ్రయం కల్పించి విద్యా, వైద్యం, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఎంతో భవిష్యత్తు ఉన్న బాలల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జీవీ భాస్కరరావు, సంగీతరావు, ఎ.గంగాభ వానీ, పారాలీగల్ వలంటీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475